హైదరాబాద్.
10-3-84.

సర్,

భారత దేశం చూడాలనే కోరికతో, ఇదివరలో నేను చూడని ప్రదేశంనించి ప్రకటనలువస్తే అప్లికేషన్ పంపటం అలవాటు. రానుపోను రైలుచార్జీలు ఇంటర్వ్యూకి పిలిచిన వాళ్ళు ఇవ్వటం. అనవాయితీ మన దేశంలో. ఆ కంపెనీ ఖర్చుతో ఇంటర్వ్యూకి హాజరయి ఆ వూరు చూసి వెళ్ళడమే నా అభిమతం. సార్ హైద్రాబాద్ వదిలి వేరేచోట ఉద్యోగం చేసే ప్రసక్తే లేదు

యువర్స్ సిన్సియర్లీ,

డబ్ల్యు కె. వి.చలపతి.

నోట్:- ఇక మీ కంపెనీ ప్రకటనలకి అప్లికేషన్స్ పంపను.

# మెరిట్ సర్టిఫికెట్

ఆ రోజు రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు చౌడేశ్వరరావు. తలుపు తీసిన తల్లికి గుప్పుమని కొట్టింది ఆల్కహాల్ వాసన. కొడుకు పార్టీకి వెళ్ళి వస్తున్నాడని గ్రహించింది. అతను తాగి వచ్చినప్పుడల్లా ఆరోగ్యం పాడవుతోందని బాధపడుతుంది ఆవిడ.

"అన్నం వడ్డించనా?" అడిగింది.

"వద్దే, కాస మజ్జిగుంటే ఇవ్వు. చాలు"

తల్లి అందించిన గ్లాసు తీసుకుని ఓ గుటక వేసి చెప్పాడు చౌడేశ్వరరావు.

"నాకు ఆఫీసులో మెరిట్ సర్టిఫికేట్ వచ్చిందే"

"ఏమిటి?" అడిగింది ఆవిడ ఆశ్చర్యంగా.

"అవునే మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చారు".

"నా కడుపున నువ్వెలా పుట్టావురా?" కసిగా అడిగింది చౌడేశ్వర రావు తల్లి.

* * *

చాలా సంవత్సరాల క్రితం.

అప్పటికి చౌడేశ్వరరావు వయస్సు పదేళ్ళు ఆ రోజు చౌడేశ్వర రావు తండ్రి చెప్పాడు ఆవిడతో.

"ఇవాళ ఆఫీస్‌నుంచి ఆలస్యంగా వస్తాను"

"పనెక్కువుందా?" అడిగింది చౌడేశ్వరరావు తల్లి

"కాదు మా ఆఫీసర్ ఇంటికి వెళ్ళాలి"

ఆ రోజు తర్వాత చౌడేశ్వరరావు తండ్రి చాలా సార్లు ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. కారణం తన ఆఫీసర్ ఇంటికి వెళుతున్నానని చెప్పేవాడు.

ఓ రోజు పనిమనిషి చెప్పింది ఆవిడకి.

"అమ్మా, ఓ సంగతి మీకు చెప్పాలి"

"ఏమిటది?"

"చాలామంది చెవులు కొరుక్కుంటున్నారు. మీ దాకా వచ్చే వుండాలి ఈ పాటికి"

"ఏమిటే చెప్పి చావు"

"మన అయ్యగారు రోజు సాయంత్రం వాళ్ళ ఆఫీసర్ ఇంటికి వెళుతున్నారు"

"దాంట్లో చెవులు కొరుక్కునే దేముంది?"

"వెళ్ళి ఆయన అక్కడ పనులన్నీ చేసి పెడుతున్నారంట".

"ఏం పనులు?"

"ఇంటికి కావలసిన వెచ్చాలు తీసుకురావటం, కిటికీలకి రంగులు వేయటం, డ్రయినేజ్ గొట్టం పాడయితే బాగు చేయటం పిల్లలని పార్కుకి తీసు కెళ్ళడం, ఇంకా...."

"ఇంకా....?"

"చెప్తే తమరికి కోపం వస్తుంది"

"రాదులే చెప్పు"

"బట్టలుతుకుతారంట"

"ఛీ.... ఛీ...."

"అవునటమ్మ చెప్తే మీక్కోపం వస్తుంది కాని, మొన్న అఫీసర్ గారి భార్య బయటుంటే ఆవిడ బట్టలు కూడా వుతికారంట"

"శివ శివ. నిజంగానటే?"

"నేను ఆయన ఆఫీసు వాళ్ళ ఇళ్ళలో పనిచేస్తాగా నలుగురయిదుగురు చెప్పారు. ఆ ఆఫీసరు ఇలాంటి పనులు చేసే కిందనించి ఈ స్థితికి వచ్చారట. ఆరికలవాటు కాబట్టి కిందవాళ్ళచేత చేయించుకుంటున్నాడు"

ఆ రాత్రి ఆయన ఇంటికి వచ్చాక నిలదీసింది ఆవిడ తను విన్నది నిజమేనా అని – కొన్ని వప్పుకున్నాడు. కొన్ని కాదన్నాడు. కాని ఆయన తరహాని బట్టి అన్నీ నిజమే అయి వుంటాయని అనిపించింది ఆవిడకి.

సాయంత్రం ఆఫీసునించి తిన్నగా ఇంటికి రమ్మనమని, ఆఫీసర్ ఇంటికి వెళ్ళద్దని అంక్షపెట్టింది ఆవిడ. కాని ఆయన ఆవిడ మాటలని ఖాతరు చేయలేదు. పనిమనిషి తరచు అక్కడ జరిగే భాగోతం చెప్తుండటం సిగ్గుతో చితికి పోయిన ఆవిడ, దాన్ని మానిపించేసింది.

తన మొగుడికి సిగ్గు శరం బొత్తిగా లేకుండా పోయాయని, అనుమానం అనే భావనే ఆయనకి లేదని ఆఫీసులో పెకి ఎలా రావాలా అనే తపనతో, ఇవన్నీ దిగ దుడుచుకు పోయాయని బాధపడింది. క్రమంగా ఆయనంటే అసహ్యం కలిగింది.

ఆ ఆఫీసరు బదిలీ అయి వెళ్ళిపోయే సమయం ఆసన్నమయింది. ఆయన చౌడేశ్వరరావు తండ్రికి బాగాపనిచేస్తాడనే మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చి, ప్రమోషన్‌కి రికమెండ్ చేసి వెళ్ళాడు.

"చూసావటే, అందరికన్నా ముందే నాకు ప్రమోషన్ వస్తుంది" చెప్పాడాయన భార్యకి గర్వంగా

ఆవిడకి అక్కడికక్కడ ఆత్మహత్యచేసుకోవాలనిపించింది.

తర్వాత పేరంటానికి వెళ్ళినప్పుడు తెలిసింది ఆ ఆఫీసులో మెరిట్ సర్టిఫికెట్ చక్కగా పనిచేసే వాళ్ళకి కాక, ఇలా ఇంటి పనులు చేసి కాకా పట్టే వాళ్ళకే వస్తుందని, వాళ్ళవలన సిన్సియర్‌గా పనిచేసే లౌక్యం లేని వాళ్ళు అలాగే వుండిపోతారని.

అప్పటినుంచి ఆవిడకి "మెరిట్ సర్టిఫికెట్" వచ్చిన వాళ్ళంటేనే అసహ్యం ఏర్పడింది.

* * *

"మెరిట్ సర్టిఫికెట్ ఎందుకిచ్చారురా?" అడిగింది ఆవిడచౌడేశ్వరరావుని.

"నే చెప్తానండి. ఈయన వంట్లో చీము నెతురు లేకపోవడం వల్ల" కోడలు చౌడేశ్వరరావు వంక నిప్పులు కక్కేలా చూస్తూ చెప్పింది.

"ఏం చేసాడు? అడిగింది ఆవిడ.

"ఈయన గారి ఆఫీసర్‌గారి ఆరోగ్యం బాగా లేదట. పొద్దునే ఆయనింటికి వెళ్ళి ఆయన యూరిన్‌స్టూల్స్ స్పెసిమన్స్ తీసుకెళ్ళి పేథలాజికల్ లేబరేటరీలో పరీక్ష చేయించి పెడుతున్నందుకు".

"ఆ తండ్రి కొడుకే" చిన్నగా నిట్టూర్చింది చౌడేశ్వరరావు తల్లి.